# భారీ వర్షాలు - వరదలతో పంటలకు తీవ్ర నష్టం - పాలకుల పట్టనితనం

***సెప్టెంబర్ 11, 12 తేదీలలోనూ, తిరిగి సెప్టెంబర్ 20-24 తేదీల మధ్య కాలంలో రెండు తెలుగు రాష్ట్రాలలో కురిసిన భారీవర్షాలు పలు ప్రాంతాల్లో ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేశాయి. హైదరాబాద్ నగరం పదేపదే జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. పలు లోతట్టు కాలనీలు నీట మునిగాయి. తెలంగాణా జిల్లాలలో పంట నష్టంతోపాటుగా, భారీవర్షాల ఫలితంగా ప్రమాదాలకు గురై పలువురు మృత్యువాతపడ్డారు.***

***ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా గుంటూరు, కర్నూలు, కడప, ప్రకాశం, గోదావరిజిల్లాలు, ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాలు భారీవర్ష కారణంగా అస్తవ్యస్తమయ్యాయి. వాగులు, వంకలు పొర్లి ప్రవహించాయి. అనేక చెరువులకు గండ్లుపడ్డాయి. ఊళ్ళకు ఊళ్ళనే వరదనీరు ముంచెత్తింది. ఏపుగా పెరిగిన పంటపొలాలన్నీ నీట మునిగిపోయాయి. గత కొంతకాలంగా వర్షాభావంతో, సాగునీరు సమస్యతో రైతాంగం ఎంతో వత్తిడికి గురయ్యారు. ఏదోలా తెప్పరిల్లుకోని పంటలు ఏపుగా పెరుగుతున్నాయని అనుకునేంతలో భారీవర్షాలు వారి ఆశలన్నింటినీ అడియాశలు చేశాయి.***

***ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల, రైతాంగ సమస్యలను గాలికొదిలి ఆగస్టు నెలంతా పుష్కరాల నిర్వహణలో కాలం గడిపింది. అనంతపురంలో కరువును, నీటి ఎద్దడిని అప్పుడే కనుగొన్నట్లుగా నటించి, రెయిన్‌గన్లతో పంటలను కాపాడినట్లుగా అనుకూల మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేసుకుంది. సెప్టెంబరు నెలలో రాష్ట్రంలో కురిసిన భారీవర్షాల గురించి వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలున్నప్పటికీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయటంలో విఫలమైంది.***

***కాలువల, చెరువుల సక్రమ నిర్వహణ, చెరువు కట్టలను పటిష్టమొనర్చటం, వాగుల సహజ గమనాలకు నిరోధకాలు లేకుండా చర్యలు చేపట్టటం, ఎక్కడికక్కడ వరదనీటిని నిల్వచేసుకునే రిజర్వాయర్ల నిర్మాణానికి సమగ్ర దృష్టి లేకపోవటం వంటి ఏలినవారి తప్పిదాలనన్నీ కప్పిపుచ్చి, ప్రకృతిపైకి నెపాన్ని నెట్టివేయటం పాలకులకు పరిపాటి అయింది. సెప్టెంబరు నెలలో కురిసిన భారీవర్షాలకు మాచర్ల - గుంటూరు రైలుమార్గంలో మొత్తం మీద కిలోమీటర్ల పొడవునా రైలుమార్గం కొట్టుకుపోయింది. రాష్ట్ర ప్రధాన రహదార్లకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. గ్రామాలలో రహదార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జననష్టం పెద్దగా లేకపోయినప్పటికీ రైతాంగం పంటలకు, ఆస్తులకు తీవ్రంగా నష్టం జరిగింది. పేదల ఇళ్ళు, గుడిశలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోజుల తరబడి పనులు కోల్పోయి ప్రజలు నానా అవస్థలు పడ్డారు.***

***వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి తక్షణ సహాయ, పునరావాసచర్యలు చేపట్టటంలో మంత్రులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. సెప్టెంబర్ 24న ముఖ్యమంత్రి ఆకాశమార్గాన పర్యటించి పరిస్థితిని సమీక్షించిన తర్వాతగానీ, కనీసం నష్టాన్ని నమోదుచేసే చర్యలకు అధికార్లు పూనుకోలేదు. దాదాపు 2 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగినట్లుగా ప్రాథమిక అంచనాలు తెలియచేస్తున్నాయి.***

***తొలివిడత, సెప్టెంబర్ 2వ వారంలో గుంటూరుజిల్లా పల్నాడు ప్రాంతంలో భారీవర్షాలు - వరద ముంపు ప్రాంతాలలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) బృందం వెనువెంటనే పర్యటించి బాధితులను పరామర్శించటంతో పాటు, పంట నష్టాన్ని పేర్కొంటూ, బాధితులకు వెంటనే అందించాల్సిన తక్షణ సహాయాన్ని గురించి మండల, రెవిన్యూ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేసింది. ఈ మొదటివిడత పర్యటన నివేదికను అందజేస్తున్నాం. ఈ నివేదికకున్న పరిమితిని అర్థం చేసుకోగలరు.***

**- సంపాదకుడు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సెప్టెంబర్ 11, 12 తేదీలలో కురిసిన అతి భారీవర్షాలకు గుంటూరుజిల్లా పల్నాటి ప్రాంతంలో పల్లెలు, పట్టణాలు, పంటభూములు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. గ్రామాలను కలిపే లింకు రోడ్లు, మండల కేంద్రాలను కలిపే ప్రధాన రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు కొట్టుకుపోయి ప్రజల రాకపోకలకు, ప్రయాణాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వేలాది ఎకరాల పంటభూములు నీట మునిగాయి. పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. కొన్ని గ్రామాలలోను, మాచర్ల, గురజాల పట్టణాలలోనూ వరదనీరు ఇండ్లలోకి ప్రవహించింది.

పల్నాడు ప్రాంతంలో భారీవర్షాలు, వరదల వల్ల సంభవించిన పరిస్థితిపై రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు – కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి, కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, కా॥ మారెళ్ళ అంజిరెడ్డి, కా॥ దానబోయిన భాస్కరరావు, కా॥ నీలాద్రి రాంబాబు, కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మరియు ఎన్‌వైయస్ జిల్లా అధ్యక్షుడు కా॥ కె. శ్రీను ఒక బృందంగా ఈ నెల 15, 16 తేదీలలో పల్నాడులో వరద ముంపు ప్రాంతాలలో పర్యటించింది.

పరిశీలనా బృందం పిడుగురాళ్ళ, కారంపూడి, దాచేపల్లి, గురజాల దుర్గి, రెంటచింతల, మాచర్ల మండలాలలో పర్యటించింది. గురజాల, దాచేపల్లి, కారంపూడి, పిడుగురాళ్ళ, మాచవరం మండలాలలో జూన్ మాసం నుండి తరచుగా వర్షాలు కురుస్తుండటంతో

ప్రత్తి, మిర్చి పంటలు విస్తారంగా వేశారు. ఈ మండలాలలో వేసిన ప్రత్తిపంట పూత, పిందె, కాయలతో కాపుదశకు వచ్చింది. మిర్చిపంట కూడా ఏపుగా పెరిగే దశలో వుంది. పంటలన్నీ ఆశాజనకంగా వున్న స్థితిలో ఈ వర్షాలు, వరదలు పంటలను సర్వనాశనం గావించాయి. ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతాంగం ఎదిగిన పంట ఏటిపాలైన తీరును చూసి దిగులుపడి గుడ్లనీరు కుక్కుకున్నారు.

కారంపూడి, పెదకొదమగుండ్ల, భట్టువారిపల్లి, నరమాలపాడు, దుర్గి, కంచరగుంట, గోగులపాడు, దాచేపల్లి, గురజాల, పులిపాడు, చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం, రెంటచింతల గ్రామాలలో ఈ బృందం రైతాంగంతో ముఖాముఖి మాట్లాడి, విషయాలు చర్చించి వివరాలు అడిగి తెలుసుకుంది. దారిపొడుగునా నీటమునిగిన పంట పొలాలను పరిశీలించింది.

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తి, మిర్చి పంటలు వేసిన రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగులో వున్న కౌలురైతులు ముందస్తు కౌలు చెల్లించారు. ఎకరానికి 15-20 వేల రూ॥ల కౌలు, అరకలు, విత్తనాలు, మందులు, కూలి కలిపి మరో 20 వేల రూపాయల వరకు ఖర్చయ్యాయని, ఒక్కపైసా కూడా తిరిగి వచ్చే పరిస్థితిలేదని, పూత, పిందె, కాయ దశలో వరదలు వచ్చి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, చేలల్లో మట్టి, ఇసుక మేటవేసిందని, చేలల్లో నీరు నిల్వ వుండి పైరు 'వురకెత్తి' వడలిపోయి ఎండిపోతోందని ఏమిచేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నాగులేరు పరీవాహక గ్రామాలైన కారంపూడి, కొదమగుండ్ల, భట్టువారిపల్లి, ఇరపరాజుపల్లి, గాదెవారిపల్లి, కేసానుపల్లి, దాచేపల్లి తదితర గ్రామాలలోను ప్రధానంగా గురజాల మండలంలో మిరియాల, చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం, గంగవరం, పులిపాడు, దైద గ్రామాలలో వేలాది ఎకరాల పంట నీటమునిగింది.

దుర్గి, కారంపూడి మండలాలలోని వరదనీరు దిగువున వున్న గురజాల మండలంపై పడటంతో మిరియాల చెరువు తెగి గురజాలలో దండివాగుకు చేరుకుని రైలుకట్టసైతం తెగి వరదనీరు గురజాలను ముంచెత్తింది. దండివాగు ప్రక్కనే వున్న వెంకట్రావుకాలనీ, చేపలకాలనీ, కోర్టులు, ఆర్డీవో, ఎమ్మార్వో ఆఫీసులు, బస్టాండు ప్రాంతమంతా నిలువెత్తు నీరు ప్రవహించింది.

అధిక వర్షాలతో, వరదలతో రైతాంగంతోపాటు వ్యవసాయకూలీలు, చేతివృత్తులవారు తీవ్రయిబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంటలు నష్టపోయి రైతాంగం, కూలిపనులు లేక ప్రజలు దిగాలుపడివున్నారు. కాని ప్రభుత్వ అధికారులు, పాలకులు ఎవరూ ఇప్పటివరకు గ్రామాలను సందర్శించి ప్రజలను పలకరించలేదు. గురజాల వరకు వచ్చి పత్రికలు, టీవీలలో ఆర్భాటపు ప్రకటనలుచేయటం మినహా పంటపొలాల పరిశీలనకు గానీ, రైతులను పరామర్శించటంగానీ చేయలేదు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) పరిశీలనా బృందం వరదల వలన నష్టపోయిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని కారంపూడి, రెంటచింతల, గురజాల మండలాల తహశీల్దార్లకు వినతిపత్రాలు యిచ్చింది. ఈ క్రింది డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరింది.

- అధికవర్షాలు, వరదలతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారంగా ఎకరానికి 50 వేల రూపాయలు యివ్వాలి.
- యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఉచితంగా అందివ్వాలి.
- కౌలురైతులకు భూ యజమాని ఒప్పుదలతో సంబంధం లేకుండా నేరుగా నష్టపరిహారం అందివ్వాలి.
- కౌలురైతులకు బ్యాంకు రుణాలు యివ్వాలి.
- తిరిగి పంటలు వేసుకోవడానికి కావలసిన మినుము, శనగ, కంది తదితర పంటల విత్తనాలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి.
- గుడిసెలు, మిద్దెలు కూలిపోయి నష్టపోయిన బాధితులకు శాశ్వత గృహాలను నిర్మించాలి.
- గురజాలలో లోతట్టు ప్రాంతాలైన వెంకట్రాపునగర్, చేపలకాలనీ ప్రజలకు 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిపప్పు, 10 వేల రూ॥ల నగదు తక్షణమే యిచ్చి ఆదుకోవాలి. వారికి పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలి.
- వివిధ గ్రామాలలో చెరువులకు పడిన గండ్లను తక్షణమే పూడ్చాలి.
- తెగిన కల్వర్టులు, కొట్టుకుపోయిన రోడ్లను మరమ్మత్తు చేసి ప్రజల ప్రయాణాలకు, రాకపోకలకు యిబ్బందిలేకుండా చేయాలి.
- తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొని వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యేవరకు వ్యవసాయ కూలీలకు, చేతివృత్తులవారికి చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను అందివ్వాలి.

oooooo